చార్మినార్, కాకతీయ వైభవం రాష్ట్ర గేయం నుంచీ తొలగింపు?

మొదటిపేజీ తరువాయి...

అంటున్నాయి. మంగళవారం ఢిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లేవనెత్తిన అంశాలతో తత్తరపాటుకు గురైన సర్కారు అసలు 'జయజయహే తెలంగాణ' గీతం నుంచి కాకతీయ వైభవ ప్రస్తావన, గోలుకొండ నవాబుల గొప్పదనాన్ని చాటే చార్మినార్‌ను కీర్తించే చరణాన్ని కూడా తొలగించబోతున్నదా? అంటే అవుననే అంటున్నాయి అధికార వర్గాలు. అందెశ్రీ రాసిన 'జయజయహే తెలంగాణ...' గీతాన్ని రాష్ట్రగీతంగా గుర్తించేందుకు, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా జూన్ 2న జరగనున్న కార్యక్రమంలో అధికారికంగా ఈ గీతం విడుదల చేయటానికి సర్కారు కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. కాగా, 'జయజయహే తెలంగాణ' గీతానికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చటంపై తెలంగాణ వాదులు నొచ్చుకోవటంతో వివాదం ముసురుకున్నది. దీనిపై అందెశ్రీ చేసిన వ్యాఖ్యలు అగ్నికి ఆజ్యం పోసిన విషయం తెలిసిందే. ఈ పరిణామాలకు తోడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో చేసిన వ్యాఖ్యలు మండేగుండెల్ని మరింత రగిలించాయి. 'రాచరికపు ఆనవాళ్లు లేకుండా తెలంగాణ అధికార చిహ్నం ఉంటుందని, ఇందులో కాకతీయుల కళాతోరణం ఉండదని సీఎం వెల్లడించారు.

కేటీఆర్ ప్రశ్నలకు డైలమాలో పడ్డ ప్రభుత్వం

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. 'జయజయహే తెలంగాణ గీతం'లో ఏముందో తెలుసా ? అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. 'కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప.. గోలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్...' అని అధికారిక గీతంలో కీర్తించి... అధికార చిహ్నంలో మాత్రం అవమానిస్తారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి సహా ప్రభుత్వ అధికార యంత్రాంగం తత్తరపాటుకు గురైంది. 'మనసునెరిగి నడచుకోవలె' అన్నట్టుగానే సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే సర్కారు రాజముద్రలో కాకతీయకళాతోరణం, చార్మినార్ ముద్రలు ఉండవనే విషయంపై అప్పటికే స్పష్టత ఉన్న ఉన్నతాధికారులు ఇప్పుడు ఏకంగా 'జయజయహే తెలంగాణ' గీతం నుంచి 'కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప.. గోలుకొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్' అనే చరణాన్ని తొలగించే పనిలో నిమగ్నం అయినట్టు తెలుస్తున్నది.

ఆ గీతాన్ని పాడే అర్హత దళితులకు లేదా?

- అందెశ్రీ ప్రతిభ మేడిపండు.. అహంకారం రాచపుండు
- కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత పసునూరి

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 28 (నమస్తే తెలంగాణ): జయ జయహే తెలంగాణ గీతాన్ని దళితులకు పాడే అర్హత లేదని కవి, గాయకుడు అందెశ్రీ తనతో అన్నారని కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీన్నిబట్టి ఆయన ప్రతిభ మేడిపండులా, అహంకారం రాచపుండులా ఉన్నదని విమర్శించారు. ఈ పాటను సంబండవర్గాల వారికి మాత్రమే పాడే హక్కు ఉన్నదని, దళితులకు లేదంటూ ఆయన కరాఖండిగా చెప్పారని, ఇది దళిత జాతిని అవమానించడమేనని పేర్కొన్నారు. గత ఏప్రిల్‌లో జరిగిన సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం తరపున వాగ్గేయకారులను ఆహ్వానించే బాధ్యతను తనకు అప్పగించారని, ఆ సమయంలో అందెశ్రీకి ఫోన్ చేసి కార్యక్రమానికి రావాలని కోరానని, ఆ సమయంలోనే ఆయన స్వయంగా తనతో ఈ గీతాన్ని పాడే హక్కు దళితులకు లేదని అన్నారని, చాలా పరుషంగా మాట్లాడారని తెలిపారు. పేరు వచ్చిందని దళితుడిగా చెప్పుకోవడానికి కూడా ఆయన ఇష్టపడటం లేదని పసునూరి రవీందర్ పేర్కొన్నారు.

రాచరికపు ఆనవాళ్లు లేకుండా రాష్ట్ర చిహ్నం

త్యాగాలు, పోరాటాలను స్ఫురించేలా చిహ్నం, గేయం
సంగీత దర్శకుడిగా కీరవాణి ఎంపిక అందెశ్రీ నిర్ణయమే

- మేడిగడ్డపై జ్యుడీషియల్ విచారణ నివేదిక తర్వాతే నిర్ణయం
- తెలంగాణ ఉత్సవాలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ
- కోదండరాంకు ఉత్సవాల ఆహ్వానితుల జాబితా బాధ్యత
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్

ఢిల్లీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): రాచరికపు ఆనవాళ్లు లేకుండా రాష్ట్ర అధికారిక చిహ్నంలో మార్పులు చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ కళాతోరణం కూడా రాచరిక చిహ్నమేనని చెప్పారు. మంగళవారం ఆయన ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్ తదితరులను కలిశారు. జూన్ 2న నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనాలని వారిని ఆహ్వానించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణ అంటేనే రాచరికానికి వ్యతిరేకమని, త్యాగాలు, పోరాటాలు గుర్తుకు వస్తాయని చెప్పారు. ఆ పోరాటాలు, త్యాగాలకు ప్రతిబింబంగా అధికారిక చిహ్నం, రాష్ట్ర గేయం ఉంటుందని వివరించారు. నూతన అధికారిక చిహ్నం సమ్మక్క-సారక్క, నాగోబా జాతర స్ఫూర్తికి అద్దం పడుతుందని చెప్పారు. తెలంగాణ గేయానికి సంగీతం సమకూర్చుకునే బాధ్యతను ఆ పాట రచయిత అందెశ్రీకే అప్పగించామని తెలిపారు. కీరవాణిని అందెశ్రీయే ఎంపిక చేశారని, తనకు సంబంధం లేదని తేల్చి చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో ప్రత్యేక అతిథిగా పాల్గొనాలని సోనియాగాంధీని ఆహ్వానించామని, ఆమెను సత్కరించాలని నిర్ణయించామని, దీనికి ఆమె సానుకూలంగా స్పందించారని తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రంలోని ప్రముఖులను, ఉద్యమకారులను భాగస్వాములను చేస్తామని, అందరినీ అధికారికంగా ఆహ్వానిస్తున్నామని చెప్పారు. కోదండరాం నేతృత్వంలో ఆహ్వానితుల జాబితాను తయారు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు తప్ప కరంటు కోతలు లేవని స్పష్టం చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణపై పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చామని, కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో నిపుణుల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. దేశంలో మరోసారి బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దు వంటి అంశాలను తాము ప్రస్తావిస్తే బీజేపీ నేతలు ఎందుకు భుజాలు తడుముకుంటున్నారని ప్రశ్నించారు. మోదీ గ్యారెంటీలకు వారెంటీ చెల్లిపోయిందని, దేశంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. రెండురోజుల పర్యటన పూర్తి చేసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి మంగళవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకున్నారు.

పాటకు బాణీ.. ఎవరిపని?

సంగీతంపై కమిటీలు ఏవి?

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ జాతిగీతానికి కీరవాణి సంగీతాన్ని సమకూర్చటంపై వివాదం చెలరేగుతున్నది. రాష్ట్రవ్యాప్తంగా కీరవాణిపై విమర్శలు రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నపళంగా వాటి నుంచి తప్పించుకోవటానికి, ఈ వివాదం మొత్తాన్ని చాకచక్యంగా అందెశ్రీపై నెట్టేసే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. 'సంగీత దర్శకుడిని ఎంపిక చేసుకునే బాధ్యతను అందెశ్రీకే అప్పగించాను' అని ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి పేర్కొనటం హాస్యాస్పదంగా ఉందని సాహితీవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారికంగా గుర్తించినా.. గుర్తించకపోయినా రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ ఈ జయ జయహే తెలంగాణ కంఠతా వచ్చునని వారు ఉదహరిస్తున్నారు. రాష్ట్రంలో అందెశ్రీపై ఉద్యమకారులకు, సాహితీకారులకు అపారమైన గౌరవం ఉందని, తమ స్వార్థప్రయోజనాల కోసం ఆయన గౌరవాన్ని తక్కువ చేసే పనికి ఎవరూ పూనుకోరని అంటున్నారు. వివాదం చెలరేగేసరికి దాన్ని అందెశ్రీపై తోసేయటం విమర్శలకు తావిస్తున్నది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో పాడే, బ్యాండ్‌గా వాయించే గీతానికి సంగీతం సమకూర్చుకునే బాధ్యత గీత రచయితకే అప్పగించాను అని పేర్కొనటంపై పరిశీలకులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అందెశ్రీకి సంగీత దర్శకుడిని ఎంపిక చేసుకునే బాధ్యత అప్పగించటం అంటే అందెశ్రీ అధికారికంగా ఏ హోదాలో ఉన్నారని ఆయనకు అప్పగించారు? రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, సాంస్కృతికశాఖ అందెశ్రీ సారథ్యంలో పాటకు సంగీతాన్ని సమకూర్చేందుకు ఏదైనా కమిటీ వేసిందా? ఆ కమిటీ కీరవాణిని ఎంపిక చేసిందా? నిజంగా అందెశ్రీకే అన్ని బాధ్యతలు అప్పగిస్తే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీరవాణితో చర్చలెందుకు జరిపినట్టు? రికార్డింగ్ స్టూడియోకు ఎందుకు వెళ్లినట్టు? అని తెలంగాణ సమాజం ప్రశ్నిస్తున్నది. ఒకవేళ నిజంగా గీత రచయితకే బాధ్యతలు అప్పగించానని చెప్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆ గీత రచయిత వ్యక్తం చేస్తున్న భావాలను అంగీకరించినట్టేనా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. తెలంగాణ వాదులపై తుపాకీ ఎక్కుపెట్టిన నాయకుడిగా సీఎం రేవంత్‌రెడ్డిని ఇప్పటికే రైఫిల్‌రెడ్డి అని, తెలంగాణ ఉద్యమం నుంచే కాకుండా కనీసం సీఎంగా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఇప్పటిదాకా కనీసం ఒక్కసారి కూడా 'జై తెలంగాణ' అనని నాయకుడిగా సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలున్నాయి. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంలోకానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మొదలైన తొలి అసెంబ్లీ సమావేశాల ప్రారంభానికి ముందుకానీ గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించలేదనే విమర్శలను సీఎం రేవంత్‌రెడ్డి మూటగట్టుకున్నారు. కీరవాణిని ఎంపిక చేయటం తమను అవమానించటమేనని తెలంగాణలో ఉన్న సంగీతదర్శకులు ఆగ్రహంతో ఉన్నారు. 'తెలంగాణలో కవులు సంగీత దర్శకులు లేరా? ఎంతోమంది ఉన్నారు. వారిలో ఎవరినైనా ఎంపిక చేసుకోవచ్చు కదా? ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం ఏమొచ్చింది?' అని ప్రశ్నిస్తున్నారు.

తెలంగాణ చిహ్నాభిన్నం

సర్కారు తీరుపై పోటెత్తిన తెల'గానం'

తెలంగాణ ఉద్యమంతో బంధం పెనవేసుకొనివాళ్లు.. కనీసం చారిత్రక, సాంస్కృతిక, వారసత్వ అంశాలపైనే కాకుండా కనీసం భౌతిక వాస్తవిక అంశాలతో సంబంధంలేని వాళ్లు పాలకులుగా ఉంటే ఇటువంటి పరిణామాలే సంభవిస్తాయని రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను చరిత్రకారులు విశ్లేషిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంలోని పెద్దలకు గత పాలకులపై అధిపత్యం చెలాయించాలనే యావ తప్ప తెలంగాణ మూలాలపై కనీస అవగాహనలేదని వారు విమర్శిస్తున్నారు. కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్‌ను రాచరికపు ఆనవాళ్లుగా గుర్తించటమే భావదారిద్ర్యానికి నిదర్శనమని చరిత్రకారులు మండిపడుతున్నారు. సీఎం రేవంత్ చర్యలు తెలంగాణ సమాజాన్ని కించపరిచే విధంగా ఉన్నాయని మండిపడుతున్నారు. 'చార్మినార్ అంటే.. ఒక కట్టడం కాదని, విశ్వనగరంగా ఎదిగిన హైదరాబాద్‌కు ఐకాన్' అని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే 'కాకతీయ కళాతోరణం అంటే.. ఒక నిర్మాణం కాదు.. సిరిసంపదలతో వెలుగొందిన ఈ నేలకు నిలువెత్తు సంతకం' అని అభివర్ణించారు. వీటిని తొలగించటం అంటే తెలంగాణ చరిత్రను చెరిపేయటమేనని వ్యాఖ్యానించారు.

సవరణలకు ఆనాడు అందెశ్రీ ఒప్పుకోలే!

- అందుకే రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు
- మాజీ ఎమ్మెల్యే రసమయి

హైదరాబాద్, మే 28(నమస్తే తెలంగాణ): జయ జయహే తెలంగాణ.. గీతంలో స్వల్పంగా సవరణలు చేయాలనే ప్రతిపాదనకు కవి, రచయిత అందెశ్రీ సవరణలకు ఒప్పుకోనందునే ఆనాడు కేసీఆర్ ప్రభుత్వం దానిని రాష్ట్ర గీతంగా ప్రకటించలేదని తెలంగాణ సాంస్కృతిక సారథి మాజీ చైర్మన్, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆ గీతంలోని నాలుగు చరణాలను స్వల్పంగా సవరించి రాష్ట్ర గీతంగా ప్రకటించాలని నాడు కేసీఆర్ భావించారని, దీనిపై 2014లోనే అందెశ్రీతో ఆయన అనేకసార్లు చర్చలు కూడా జరిపారని తెలిపారు. దానికి అందెశ్రీ మాత్రం తాను రాసిన పది పన్నెండు చరణాలను యథావిధిగా ఉంచాలని పట్టుబట్టారని, లేకుంటే ఆ పాటను రాష్ట్ర గీతంగా వాడొద్దని చెప్పారని పేర్కొన్నారు. రాష్ట్ర గీతానికి పది పన్నెండు చరణాలు పెట్టడం సాధ్యంకాదని ఆనాడు భావించినట్టు పేర్కొన్నారు. దీంతో వివాదం ఎందుకనే ఉద్దేశంతో కేసీఆర్ ఈ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించలేదని, అంతే తప్ప జయ జయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా ప్రకటించవద్దనో, లేక అందెశ్రీని అగౌరపర్చాలనో ఎంతమాత్రం కాదని రసమయి తెలిపారు.

పాలనకు ప్రతీకలు.. కళాతోరణాలు

- ప్రజలకు పాలకులు ఇచ్చిన ప్రాధాన్యానికి సూచికలు
- ఆనాటి చారిత్రక సంపదకు చిహ్నాలు
- పారదర్శకతకు నిలువుటద్దాలు
- 1,117లో తోరణాల ఏర్పాటు
- తొలుత హనుమకొండ.. ఐనవోలు, కొలనుపాకలో..
- చివరగా ఖిలా వరంగల్‌లో..

కాకతీయ కళాతోరణాలు కేవలం అలంకారం కోసం చేసిన ఆకృతులు కానే కావు. ఆ తోరణాల్లో ఆనాటి కాకతీయ రాజుల పాలనా వైభవమంతా పూస గుచ్చినట్టుగా ఉంటుంది. నాడు ప్రజల సుభిక్ష పాలనకు అద్దంపడుతున్నాయి. అపార జలరాశి పరవళ్లు తొక్కడంతో పండిన అపార పంటలకు ఆనవాళ్లుగా, ఆనాటి ఆర్థిక పురోగతికి సంకేతాలుగా నిలిచాయి. కాకతీయ రాజుల ఎదురులేని కీర్తి పతాకాలుగా, గ్రామీణ సంస్కృతికి ప్రతిబింబాలుగా ముందు తరాలకు చరిత్రను అందిస్తున్నాయి.

తెలంగాణలో తోరణద్వారాలు

1. కొలనుపాకలో సోమేశ్వర ఆలయ ద్వారం, బయట రాజద్వారం-2
2. నందికందిలో గుడివద్ద-1
3. వెల్దుర్తిలో దారిమీద-1
4. రామగుండం ఆలయం ముందర-1
5. గొడిశాల గుడి బయట-1
6. ఒల్లాల కేశవాలయ శిథిలాల వద్ద-1
7. డిచ్‌పల్లి గుడిమెట్ల ముందర-1
8. ఇంద్రేశం శివాలయం ముందర-2
9. మల్లికుదుర్లలో-1
10. ఐనవోలు-4
11. హనుమకొండ-4
12. వరంగల్లు-4 (ప్రతాపగిరి కోట ప్రవేశద్వారం, గజలక్ష్మి లలాటబింబం)

(పిన్నింటి గోపాల్), వరంగల్, మే 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ప్రజలే కేంద్రంగా పరిపాలన సాగించిన కాకతీయులు అనగానే మొదట గుర్తుకు వచ్చేది కాకతీయ కీర్తి తోరణాలు. కాకతీయ కళాతోరణం, స్వాగత తోరణం, ద్వారతోరణం, స్వాగత తోరణం, విజయ తోరణం, శిలాతోరణ ద్వారం... ఇలా ఎన్ని పేర్లతో పిలిచినా కాకతీయ తోరణాలు ఆనాటి శిల్పుల గొప్ప కళా నైపుణ్యానికి నిలువెత్తు నిదర్శనంగా ఇప్పటికీ నిలిచి ఉండటం విశేషం. భారతీయ ఆలయాల నిర్మాణ వాస్తు సంప్రదాయంలో తోరణాల నిర్మాణం క్రీస్తు పూర్వం రెండో శతాబ్దంలోనే మొదలైంది. తోరణాల నిర్మాణ పద్ధతికి ఆద్యుడిగా శాతవాహన రాజైన శ్రీశాతకర్ణిని పేర్కొనవచ్చు. ఆయన సాంచీ స్తూపం చుట్టూ నాలుగు దిక్కుల్లో నాలుగు తోరణ ద్వారాలను నిర్మించాడు. ప్రస్తుతం హిందూ ఆలయాలకు మనం చూస్తున్న తోరణ ద్వారాల నిర్మాణ సంప్రదాయం బౌద్ధస్తూపాల తోరణాల ద్వారా వచ్చింది. కాకతీయుల మొదటి రాజధాని హనుమకొండలోని పద్మాక్షి గుట్ట వద్ద ఏర్పాటు చేసిన మొదటి దశ తోరణంగా చరిత్రకారులు తెలిపారు. దీనిని 1,117వ సంవత్సరంలో దీన్ని ఏర్పాటు చేసినట్టుగా చెప్తారు. ఐనవోలు, కొలనుపాకల్లో ఏర్పాటుచేసిన రెండో దశ తోరణంలో లేని ప్రత్యేకతలు వరంగల్ కోటలోని తోరణాల్లో మనకు కనిపిస్తాయి. అనంతరం కాకతీయుల రాజధాని ఓరుగల్లు(ఖిలా వరంగల్)కు మారింది. అక్కడ ప్రతిష్ఠించిన కీర్తి తోరణాలు మరింత కళావైభవంతో కనిపిస్తాయి. హంసలు, మొసళ్లు కాకతీయ తోరణాల్లో ప్రముఖంగా కనిపిస్తాయి. కాకతీయ కాలపు శిల్పులు. తెలుగు ప్రజల కళాదృష్టికి, అభిరుచికి, కాకతీయుల కాలపు శిల్పుల కళా ఔన్నత్యానికి నిదర్శనాలుగానూ, అందులో వారి ప్రతిభను చాటి చెప్పే కీర్తి తోరణాలుగానూ ఆ శిలా తోరణాలు ఇప్పటికీ నిలిచి ఉండటం విశేషం. వరంగల్ కోటలో నాలుగు కాకతీయ తోరణాలు సమానదూరాలలో విస్తరించి దర్శనమిస్తాయి. చూసేందుకు ఓ అలంకారపు ద్వారంలా కనిపించినా అందులో తెలుసుకోవాల్సిన అంశాలెన్నో ఉన్నాయి.

కాకతీయుల తొలి రాజధాని హనుమకొండ

కాకతీయ కళా తోరణద్వారాల కంటే ముందు కూడా తోరణ ద్వారాలున్న ఆలయాలు ఉన్నాయి. ఈ తోరణ ద్వారాలు ఆలయాలకు మాత్రమే కాకుండా నగర ద్వారాలుగానూ ఉన్నాయి. కాకతీయుల మొదటి రాజధాని హనుమకొండ ద్వారాలు ఎలాంటి అలంకారాలు లేకుండా ఉన్నాయి. హనుమకొండ చౌరస్తా నుంచి పద్మాక్షి ఆలయానికి వెళ్లే దారిలో ఒక తోరణం, సిద్ధులగుట్ట వెనుక భాగంలో మరో రెండు ద్వారాలు ఉన్నాయి. కాకతీయ తోరణ ద్వారాలను పోలిన ద్వారాలు ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయానికి నలువైపులా ఉన్నాయి. ఇవికాకుండా మెదక్ జిల్లాలోని నందికంది, వెల్దుర్తి, యాదాద్రి-భువనగిరి జిల్లా కొలనుపాక, పెద్దపల్లి జిల్లా ఆబాది రామగుండంలోని శివాలయం ముందు కూడా తోరణ ద్వారాలు ఉన్నాయి. రామగుండం, నందికంది, వెల్దుర్తి, కొలనుపాకలో ద్వారం ఉత్తరాశి (లెంటిల్)మీద ఇరువైపులా రెండు రకాల శిల్పాలున్న శిలలను అమర్చారు. ద్వారస్తంభాలు ఉత్తరాశి కలిసేచోట సింహశిల్పాలను బ్రాకెట్లుగా వాడారు. పంటలు బాగా పండేవి. కాకతీయుల కాలంలో ప్రజలకు ఆకలిబాధ ఎలా ఉంటుందో తెలియదంటే అతిశయోక్తి కాదు. పైన ఇరువైపులా రెండు హంసలు కాకతీయుల పారదర్శక పాలనకు నిదర్శనం. చేతులు పైకెత్తిన కుబేరుల విగ్రహాలు ఆర్థిక పరిపుష్టికి సంకేతం. మొసలి కింది భాగంలో వజ్ర వైఢూర్యాల దండలు కాకతీయుల వైభవానికి చిహ్నం. ఆర్థిక పురోగతి అద్భుతంగా ఉండేదని సంకేతం. ఏడు పూర్ణ కుంభాలు గ్రామదేవతల ప్రతిబింబాలు. వాటినే సప్తమాతృకలు అని కూడా పిలుస్తారు. స్తంభం మధ్యభాగంలో చేపల బొమ్మలు ఓ వెలుగు వెలిగిన మత్స్య పరిశ్రమకు సంకేతం.

కళాతోరణాల ప్రత్యేకత

కాకతీయుల పాలనా వైభవమంతా ఈ కళా తోరణాల్లో పూస గుచ్చినట్టుగా ఉంటుంది. వారి ఏలుబడిలో ఏయే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారో మనకు తెలుస్తుంది. హంసలు, మొసళ్ల కాకతీయ తోరణంలో ప్రముఖంగా కనిపిస్తాయి. పద్మాలు, మొక్కలు, తలకిందులుగా వేలాడినట్టుండే తామెర మొగ్గల వంటి ఆకృతులు ఇలా ఎన్నో అంశాల కలబోత వరంగల్ కాకతీయ తోరణాలు. నాలుగు పిల్లర్లు వారి పాలనలో ధర్మం నాలుగు పాదాల మీద నడిచిందనడానికి నిదర్శనంగా మనకు కనిపిస్తుంది. చివరి రెండు పిల్లర్ల మీద ఇరుపక్కలా గర్జించిన సింహాలు కాకతీయుల ఎదురులేని నాయకత్వానికి చిహ్నం. దానిపక్కన తల పైకెత్తిన మొసలి జలకళకు ప్రతీతి. కాకతీయుల కాలంలో చెరువులు, కుంటలు, కాలువల్లో పుష్కలంగా నీళ్లుండేవి. నీళ్లు ఎక్కడైతే ఉంటాయో అక్కడ మొసళ్లు ఉంటాయి. తోరణం నిండా లతలు, తీగలు పారే గొలుసుకట్టు చెరువులను, కుంటలనూ సూచిస్తాయి. అపార జలరాశి పరవళ్లు తొక్కడంతో ఆ కాలంలో

హనుమకొండలో మట్టికోట నిర్మాణం

కాకతీయ రెండో ప్రోలరాజు కాలంలో తొలి రాజధాని అయిన అనుమకొండలో కోట నిర్మాణం జరిగింది. సిద్ధులగుట్ట, అగ్గలయ్య గుట్ట, భద్రకాళి గుట్టలను కలుపుతూ మట్టికోట నిర్మాణం చేశారు. ఈ మూడు కొండలపై కోట గోడలను నిర్మించారు. ఆ గోడల శిథిలాలు ఇప్పటికీ ఉన్నాయి. హనుమకొండ చౌరస్తా నుంచి పద్మాక్షి ఆలయానికి వెళ్లే దారిలో అగ్గలయ్య గుట్ట పక్కన రోడ్డు మీద ఒక రాతి ద్వారం ఉంది. ఇదే హనుమకొండ కోట ప్రవేశద్వారం. ఎలాంటి అలంకారాలు లేకుండా 20 అడుగుల ఎత్తున కేవలం రెండు నిలువు స్తంభాలు, వాటిపై ఒక అడ్డ దూలం ఉంది. ద్వారానికి కోట తలుపులు పెట్టిన ఆనవాళ్లేమీ లేవు. సిద్ధేశ్వర ఆలయ సమీపంలో ఉన్న సిద్ధులగుట్ట పక్కన మరో రెండు రాతిద్వారాలు ఉన్నాయి. ఇంకొక రాతిద్వారం పూర్తిగా ధ్వంసమై ప్రస్తుతం ఒకే స్తంభం మిగిలి ఉన్నది. ఈ రాతిద్వారాలు కాకతీయ కీర్తితోరణ ద్వారాల కన్నా ఎంతో ప్రాచీనమైనవి.

యుద్ధానికి సూచిక గొడిశాల తోరణం

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వద్ద సైదాపురం మండలంలో గొడిశాల గ్రామం ఉన్నది. ఢిల్లీ సుల్తానులకు, కాకతీయులకు ఇక్కడే యుద్ధం జరిగింది. ఢిల్లీ సుల్తాన్ అల్లాఉద్దీన్ ఖిల్జీ 1303లో మాలిక్ ఫక్రుద్దీన్, జునాఖాన్ నాయకత్వంతో పంపిన సేనలను కాకతీయ సేనానులైన పోతుగంటి మైలి, రేచర్ల వెన్నభూపాలుడి నాయకత్వంలో కాకతీయ సైనికులు వీరోచితంగా పోరాడి దండయాత్రను తిప్పికొట్టారు. అప్పుడే ఆ గ్రామ సమీపంలో ఒక తోరణాన్ని నిర్మించారని చరిత్రకారులు చెప్తారు.

వరంగల్ ద్వార తోరణాల ప్రత్యేకత

వరంగల్‌లోని కాకతీయుల కోట శిథిలాలకు నలువైపులా నిలిచి ఉన్న నాలుగు ద్వార తోరణాలను 'తోరణ ద్వారాలని, హంస ద్వారాలని, కీర్తి తోరణాలని' చరిత్రకారులు పేర్కొన్నారు. వరంగల్ కోట మధ్యభాగంలో నాలుగు తోరణ ద్వారాలు నిర్మించబడ్డాయి. ప్రతి ద్వారానికి నాలుగు స్తంభాలు, రెండువైపులా రెండేసి స్తంభాలు ఉన్నాయి. పెద్ద రాతిదూలానికి కిందివైపు ఏడు తామెర మొగ్గలు ఉన్నాయి. దూలానికి రెండు చివరలా పైవైపు రెండు హంసలు నిలబెట్టి ఉన్నాయి. రాతి దూలాన్ని, స్తంభాలను కలుపుతూ రెండువైపులా నాసికలు (బ్రాకెట్లు)గా సింహశిల్పాలు అమర్చి ఉన్నాయి. రాతిదూలం మీద అమర్చిన శిలాఫలకాల మీద అద్భుత శిల్పకల మనకు కనిస్తుంది. తూర్పు ద్వారంపై (ధన) లక్ష్మి, పడుమటి ద్వారంపై గణపతి, ఉత్తర ద్వారంపై సూర్య విగ్రహ శిల్పాలు ఉన్నాయి.

ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ చేతిలో నుంచి మైక్‌ను లాక్కుంటున్న పాశం యాదగిరి

చంద్రబాబు ఏపీలో గెలిస్తే తెలంగాణను కలిపేస్తరేమో!

కాంగ్రెసోళ్లే కలుపుతమంటరేమో!.. దొంగలు, ద్రోహులంతా అటే ఉన్నరు..

జూన్ 2 వేడుకలకు మేమెవ్వరం రాము.. ఉద్యమకారులూ రావొద్దు: పాశం

హైదరాబాద్, మే 28 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ కాంగ్రెస్ నేతల తీరుతో భయం కలిగిస్తోందని సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు పాశం యాదగిరి ఆందోళన వ్యక్తం చేశారు. 'తెలంగాణ ద్రోహులను పక్కన పెట్టుకొని దశాబ్ది ఉత్సవాలు ఎలా నిర్వహిస్తారు.? చేసిన తప్పులను కాంగ్రెస్ సరిదిద్దుకోవాల్సిందే. ఈ డిమాండ్‌తోనే తెలంగాణ ఐక్య వేదిక తరపున ప్రభుత్వ వేడుకలను బహిష్కరిస్తున్నాం' అని పాశం యాదగిరి ప్రకటించారు. జూన్ 2న జరిగే ప్రభుత్వం జరపతలపెట్టిన సన్మానానికి ఎవరూ వెళ్లొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో మంగళవారం నేర్నాల కిషోర్ రచించిన 'దచ్చన్న దారిలో త్యాగాల పాట' విడుదల కార్యక్రమానికి కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్‌తో పాటు కోదండరాం, హరగోపాల్, పాశం యాదగిరి, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్, పాశం యాదగిరికి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని, తెలంగాణ ఉద్యమకారులను ఈపండుగ సందర్భంగా ఘనంగా సన్మానిస్తుందని చెప్పారు. దీనికి పాశం యాదగిరి అభ్యంతరం చెపుతూ మహేశ్‌కుమార్‌గౌడ్ చేతిలోని మైక్‌ను లాక్కున్నారు. తెలంగాణ కోసం చేసుకునే పండుగా.. దీనికి అభ్యంతరం చెప్పొద్దు. కాంగ్రెస్ పద్ధతి బాగా లేదని దాన్ని సరిచేసుకోవాలని సూచించారు. దీనిపై మహేశ్ స్పందిస్తూ 'మీరు మాట్లాడేది తప్పు. మాట్లాడే సందర్భం కాదు. ముఖ్యమంత్రి రమ్మంటే మీరు రాము అంటే ఎట్లా?'అని మహేశ్‌కుమార్‌గౌడ్ అనడంతో గొడవ తీవ్రమైంది. పాశం యాదగిరి మాట్లాడుతూ.. 'తెలం